క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్


సుజాత

కాటారం: మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న చెప్యాల సుజాత డాక్టరేట్ పొందారు. సుజాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సుజాత యూనివర్సిటీ విద్యా విభాగంలో ఆంగ్ల ఆధునిక బోధన పద్ధతుల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 'ఏ స్టడి ఆన్ ది ఇన్‌ఫ్ల్యూయేన్స్ ఆఫ్ డిస్‌కర్స్ ఓరియంటల్ పెడగగి ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఆఫ్ సెకండరీ లెవల్' అనే అంశంపై ఆచార్య చంద్రకళ ఆధ్వర్యంలో ఆచార్య మేరి సునంద మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి తన పరిశోధన పత్రాన్ని ఎక్జామినర్ అహ్మద్ పటేల్ సమక్షంలో ఆచార్య ముష్తాఖ్‌కు సమర్పించారు. దీంతో సుజాతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. తనకు సహకరించిన తన కుటుంబ సభ్యులు, ఆచార్యులు, తోటి ఉపాధ్యాయులకు, ఈఎల్‌టీఏ సభ్యులకు సుజాత కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ పట్టా అందుకున్న సుజాతను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

కళాశాలలో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మలతో విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని సువిద్య డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు కరస్పాండెంట్ రాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోనే అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. అధ్యాపకులు వేణు, లోకేందర్‌రెడ్డి, తిరుపతి, మమత, యుగందర్, సాంబయ్య, హరికృష్ణ, శ్రీనివాస్, నాగరాణి, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

ఏటూరునాగారం: వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో మరో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ దివాకర టీఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటూరునాగారంలో ఉన్న డయాలసిస్ కేంద్రాలు రోగులకు సరిపోవడం లేదని, మరోక డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద నాయక్, కూనూర్ అశోక్ గౌడ్, కాకులమర్రి ప్రదీప్ రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


రేగొండ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కొత్తపల్లిగోరి ఎస్సై దివ్య గురువారం తెలిపారు. మండలంలోని జమ్‌షేడ్‌బేగ్‌పేట వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. ఈమేరకు మేకల రవికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు



మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో గురువారం క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని చుంచుపల్లి, వాడగూడెం, మల్లూరు, నర్సింహాసాగర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు, దగ్గు, తెమడ, దమ్ము, జ్వరంతో బాధపడుతూ వారికి తెమడ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు.

వైద్యశిబిరం పరిశీలన



మంగపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి స్వప్నిత ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రి కంటి వైద్య వైద్య నిపుణులు డాక్టర్ స్రవంతి 220 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా, ఈ వైద్య శిబిరాన్ని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అఖిల, మనోజ్‌కుమార్, తరుణ్ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, హెచ్‌వీ పద్మ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షాలు..


ఉధృతంగా ప్రవహిస్తున్న చలివాగు


అలుగు పోస్తున్న టేకుమట్ల చెరువు

- ఉప్పొంగుతున్న చలివాగు, మానేరు
- నిండుకుండలా చెరువులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

టేకుమట్ల: నాలుగు రోజులుగా మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. చలివాగు, మానేరులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని అన్ని చెరువులు కుంటలు నిండుకుండలా మారాయి. వర్షాకాలం ఆరంభంలో సరైన వర్షాలు లేక చెరువుల్లో నీరు లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత వర్షాలతో మండలంలోని టేకుమట్ల, వెలిశాల, వెలంపల్లి, దుబ్యాల, తదితర గ్రామాల్లోని చెరువులు అలుగు పడ్డాయి. అంకుషాపూర్ సోమనపల్లి గ్రామాల్లోని లోతట్టు ప్రాంతంలో ప్రజల ఇండ్లలోకి నీళ్లు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


చలివాగు వరదను పరిశీలిస్తున్న పోలీసులు

అప్రమత్తంగా ఉండాలి

ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలి. రైతులు వ్యవసాయ బావుల వద్ద గల మోటార్ స్టార్టర్ల వద్ద జాగ్రత్త ఉండాలి. ఇటీవల మానేరులో ఇసుక కోసం వెళ్లిన పది ట్రాక్టర్లు వరదలో చిక్కుకున్నా అదృష్టవశాత్తు డ్రైవర్లు సురక్షితంగా బయటికి వచ్చారు. అలాంటి సంఘటనలు జరగకుండా ఎప్పడికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలుపుతున్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు..



చలివాగు, మానేరు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు. అలాగే చెరువులు అలుగు పడుతుండడంతో ప్రమాదకరంగా మరాయి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

- దాసరి సుధాకర్
ఎస్సై, టేకుమట్ల

బారులుదీరిన ఇసుక లారీలు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం


రోడ్డుపై నిలిచిన లారీలు

మల్హర్: మండలంలోని మల్లారం ఇసుక క్వారీ నుంచి కొయ్యూరు నాగులమ్మ వరకు ప్రధాన రహదారిపై ఇసుక లారీలు నిలిపారు. ప్రయాణికుల కోసం నిర్మించిన ప్రధాన రోడ్డు ఇసుక లారీలలో నిండిపోయింది. రూట్ మ్యాప్ లేకుండా లారీలను అనుమతించడం, వచ్చిన వాహనాలను వెంటనే లోడ్ చేయకపోవడం, ప్రధాన రహదారిపై లారీలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మల్లారం క్వారీకి నాలుగు రోజులుగా ఇసుక లోడింగ్ కోసం ప్రతీ రోజు 50 నుండి 120 లారీలు చేరుకుంటున్నాయి. పెద్దపల్లి జిల్లా అడవి సోమన్‌పల్లి క్వారీ బంద్ కావడంతో ఆ క్వారీ లారీలను సంబంధిత శాఖ అధికారులు మల్లారం క్వారీకి బదిలీ చేశారు. దీంతో గురువారం ఒక్క రోజే ఒక్కదాని వెంట మరొకటి 300 మేర లారీలు రైలు బోగీలను తలపిస్తూ మల్లారం రావులపల్లి ఇసుక క్వారీ నుంచి కొయ్యూరు నాగులమ్మ వద్దకు నాలుగు కిలోమీటర్ల మేర లారీలు బారులుదీరాయి. గంటల తరబడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో కొయ్యూరు పోలీసులు అక్కడి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా ఇసుక లోడింగ్ చేయడానికి నింబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు లారీల వద్ద నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాజ్‌మహ్మద్

చిట్యాల: ముస్లిం, మైనార్టీ కులాలకు రెండు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం ముస్లింలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మజీ కో–ఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్ మాట్లాడుతూ.. మంత్రి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మైనారిటీ ప్రజలకు రెండు పథకాలకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని రంగాపురం గ్రామంలో ఎల్లమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి భూమి పూజా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ దేవతల ఆలయాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ దేవాలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలకు నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ రఫీ, మాజీ వైస్ ఎంపీపీ పోలినేని రాజేశ్వరావు, నాయకులు తక్కళ్లపల్లి రాజు, ఆకుతోట కుమారస్వామి, కత్తి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలేవి?

- మూడు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది


తాడిచర్లలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

మల్హర్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు రావడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని జీతాలు అవి కూడా సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నారు. పెండింగ్ వేతలనాలు విడుదల చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విధుల్లో 59 మంది కార్మికులు

మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 59 మంది మల్టీవర్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాడిచర్లలో 14, మల్లారంలో 6, పెద్దతూండ్ల 6, చిన్నతూండ్ల 2, దుబ్బపేట 2, అడ్వాలపల్లి 2, కొయ్యూరు 2, వల్లెకుంట 4, కొండంపేట 2, ఎడ్లపల్లి 3, ఇప్పలపల్లి 2,రుద్రారం 5, అన్సాన్‌పల్లి 4, నాచారం 4, మల్లెంపల్లి 1 కార్మికులు తమ విధులును రోజు రోజు వారి సక్రమంగా చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం ఒక్కక్కరికీ నెలకు సుమారు రూ.9500 వేతనం చెల్లిస్తోంది. ప్రస్తుతం సెప్టెంబర్ నెల గడిస్తే మూడు నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉంటాయి. ఈ వేతనం సమయానికి అందక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం బతుకమ్మ, దసర పండుగ నేపథ్యంలో వేతనాలు రాక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని కార్మికులు వాపోతున్నారు. పెండింగ్ వేతనాల సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు.

అప్పులు చేస్తున్నాం..



మూడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నాం. ప్రభుత్వం చర్యలు తీసుకొని పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- లింగమయ్య, పంపు ఆపరేటర్, తాడిచర్ల

జీతాలు ఇవ్వాలి



మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. ఎప్పుడు అడిగిన వస్తుంది.. ఇస్తాం అంటున్నారు. కానీ ఇవ్వడం లేదు. ఒక్క నెల రాకుంటే ఎలాగో గడుపుతాం. కానీ మూడు నెలలుగా జీతాలు రాకుంటే కుటుంబం ఎలా పోషించుకోవాలి. ప్రస్తుతం దసర పండుగ నేపథ్యంలో అప్పు చేయాల్సి వస్తుంది. అధికారులు వెంటనే జీతాలు ఇవ్వాలి.

- సమ్మక్క, కార్మికురాలు, తాడిచర్ల

కాత్యాయనీదేవిగా అమ్మవారు


రేగొండ: ఎస్సైకి చీరను అందజేస్తున్న అర్చకులు


మొగుళ్లపల్లిలో..

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో దేవి శరన్నవ రాత్రుల సందర్భంగా నాలుగో రోజు కాత్యాయనీ దేవిగా అమ్మ వారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఎస్సై సాకపురం దివ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎస్సైకి అమ్మవారి చీరను, తీర్థప్రసాదాలు అందజేశారు.

మొగుళ్లపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివరామకృష్ణ భజనమండలి సభ్యుల సేవా సహకారంతో మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత నాలుగో రోజు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణవంక నవీన్, ప్రసాద్, భజనమండలి సభ్యులు, అన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి రోడ్డుపై కూలిన చెట్టు


రోడ్డుపై కూలిన చెట్టు

పలిమెల: కురుస్తున్న వర్షానికి మండలంలోని పంకెన రామలక్ష్మణుల చెట్ల సమీపంలో గురువారం మధ్యాహ్నం భారీ చెట్టు కూలి రోడ్డుపై పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా వర్షం పడుతుండటంతో అధికారులు ఆ వృక్షాన్ని తొలగించలేదు. గమనించకుండా ఎవరైనా వేగంగా వస్తే ప్రమాదం జరిగే అస్కారం ఉంది. అధికారులు వెంటనే చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

రేపు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 27న కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ ఎలగొండ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

దీన్‌దయాళ్ ఆశయాలను కొనసాగించాలి


చిట్యాల: దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు


రేగొండ: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల: దేశం కోసం పని చేసిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను కొనసాగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పండిత్ దీన్‌దయాళ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు మైదం శ్రీకాంత్ చెక్క నర్సయ్య, నీలి సుధాకర్ రెడ్డి, గుర్రపు రవి, ఏలేటి శ్రీనివాస్, రెడ్డి, బండారి భద్రయ్య, మహేష్, ప్రభాకర్, తిరుపతి, అజయ్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: దీన్‌దయాళ్ ఉపాధ్యాయుడి స్ఫూర్తితో ముందుకు సాగుదామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండల రాజు పేర్కొన్నారు. గురువారం దీన్ దయాల్ జయంతి వేడుకలను మండల ప్రధాన కార్యదర్శి తూర్పాటి మల్లేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీన్ దయాళ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూధర్మ పరిరక్షణకు దీన్ దయాల్ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్‌రెడ్డి లింగారెడ్డి, సయ్యద్ గాలిఫ్, రమణారెడ్డి, రఘు, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

మేడిపల్లిలో 'ఆది కర్మయోగి అభియాన్'


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కాటారం: మండలంలోని మేడిపల్లిలో కేంద్ర బృందం ఆధ్వర్యంలో గురువారం ఆది కర్మయోగి అభియాన్ ప్రతి స్పందనాత్మక పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆది సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. గ్రామపంచాయితీ పరిధిలో అర్హులైన అందరికి రేషన్‌కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డు, పీఎం కిసాన్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు అందించాలని తెలిపారు. లింక్‌రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, వాటర్ ట్యాంక్ నిర్మాణం, సైడ్ డ్రైయినేజీల నిర్మాణం లాంటి గ్రామ అభివృద్ధికి అవసరం అయ్యే ప్రణాళిక విలేజ్ మాస్టర్ ట్రైనింగ్ టీం ద్వారా తయారు చేసి సెంట్రల్ టీంకు అందించాలని బృందం సభ్యులు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏటూరునాగారం ఏపీఓ వసంత రావు, ప్రభారి ప్రేమ్‌చంద్, పంచాయితీ కార్యదర్శి రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం ప్రేమ్ నగర్, ములుగు పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ సంజీవ్ మాట్లాడుతూ.. యువత చెడు మార్గం వైపు ప్రయాణించకుండా సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండేంట్ పిచ్చిరెడ్డి, డైరెక్టర్ వెంకటరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ కుమార్, అధ్యాపకులు నరేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం


విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వాజేడు: మండల కేంద్రానికి చెందిన తల్లడి నవ్యగ్నాపిక 2024–25 విద్యా సవత్సరంలో నీట్ ఎన్ట్రెన్స్ రాసి మొదటి విడతలోనే హయామత్ నగర్‌లోని నోవా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. గురువారం భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శాలువా కప్పి సన్మానించారు. పేద విద్యార్థి కావడంతో ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి అవసరమైన పుస్తకాలను సొంత ఖర్చులతో ప్రతీ సంవత్సరం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదే విధంగా ఆమె చదువుకు రూ.16 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే విషయాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కల దృష్టికి తీసుకువెళ్లి ఆదుకునేలా చూస్తానని తెలిపారు. మాజీ జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్ తదితరులు ఉన్నారు.

ముక్తి ఆశ్రమంలో చివరి మజిలీ


పరామర్శిస్తున్న మధు

మల్హర్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన గౌరవెల్లి రాజు గురువారం మృతి చెందాడు. అద్దె ఇంట్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటి యజమాని అంగీకరించలేదు. దీంతో మంథనిలోని పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ముక్తి ఆశ్రమంలో అంతిమ కార్యక్రమం నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రాజు మృతదేహం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. పేదోడి ఆఖరి మజిలీలో ఎలాంటి ఇబ్బందులు రాకూడనే ఆలోచనతో ముక్తి ఆశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మధు తెలిపారు.